# నిర్ణయం

— పాలాని సోమరాజు

షుమారు పదేళ్ళయిందనుకుంటాను ఇంతకు పూర్వం మా ఊరొచ్చి. మళ్ళీ ఇన్నాళ్ళకి రావటమయింది.

మావారు కాలిఫోర్నియా స్టేట్‌లోవున్న "జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీస్"లో సైంటిస్టుగా పనిచేస్తున్నారు. నేను కూడా "యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా"లో లైబ్రరియన్‌గా పనిచేస్తున్నాను.

గత మూడేళ్ళ నుంచీ ఇండియాకు రావాలనుకుంటూనే ఏవేవో కారణాల చేత రాలేకపోతున్నాము.

తీరా మేమూ మా పిల్లలు అంతా కలిసి రావాలని ప్రయాణం పెట్టుకునే సరికి మా వారికేదో అర్జంటు పని తగిలింది ఆఫీసులో. అంచేత వారు ఆగిపోవాల్సి వచ్చింది.

మావారి ప్రయాణం ఆగిపోవటంతో అమ్మాయి స్వీటీ, అబ్బాయి వినయ్ కూడా రావటం మానేశారు. ఇక నాకు తప్పలేదు.

మామూలు పరిస్థితుల్లో అయితే నేను ప్రయాణం మానుకునేదాన్ని. కాని ఇప్పుడలా చెయ్యడానికి వీల్లేదు. ఓ విధంగా మా స్వీటీయే దానిక్కారణం.


స్వీటీ చిన్నప్పట్నించీ అమెరికాలోనే పెరిగింది. దానికి అక్కడి అలవాట్లు, స్నేహాలు బాగా వంట పట్టాయి. చిన్నప్పుడయితే వాటి వల్ల మాకు బాధనిపించేది కాదు. కాని స్వీటీ ఇప్పుడు చిన్నపిల్ల కాదు. పై పెచ్చు ఇప్పుడు దానికో బాయ్‌ఫ్రెండ్ కూడా వున్నాడని తెలిసేసరికి మాకు కొంచెం కంగారెక్కువయింది.

స్వీటీని మొదట్నించీ మా మేనల్లుడుభాస్కర్‌కిచ్చి పెళ్ళి చేద్దామనుకునే వాళ్ళం. వాడిప్పుడు "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగుళూరు"లో డాక్టరేట్ చేస్తున్నాడు. డాక్టరేట్ పూర్తయింతర్వాత పెళ్ళి విషయాలు మాట్లాడుకోవచ్చులే అని వూరుకున్నాం. కాని ఇప్పుడంత వరకూ ఆగే వ్యవధి లేదు.

స్వీటీ తప్పటడుగు వేస్తుందని కాదు. దానికా మాత్రం ఆత్మనిగ్రహం, మన సాంప్రదాయాలపై అవగాహన వుందని నాకు తెలుసు.

వచ్చిన భయమల్లా స్వీటీకి దాని అమెరికన్ బాయ్‌ఫ్రెండ్‌కీ గల స్నేహం ఎక్కడ పెళ్ళికి దారి తీస్తుందోనని. అదే ఏ భారతీయుడైనా అయ్యుంటే ఇంత తొందరపడాల్సివచ్చేది కాదు.

నేనొస్తున్నట్టుగా మా అన్నయ్యకు కేబుల్ ఇచ్చాను. దాని ప్రకారం మా అన్నయ్య మద్రాసు ఎయిర్ పోర్టులో నన్ను రిసీవ్ చేసుకున్నాడు.



రాజమండ్రి వరకు ట్రెయిన్‌లో వచ్చాము. అక్కణ్ణించి మా వూరు టాక్సీలో వచ్చాం.

పూర్వం అయితే టాక్సీ ఊర్లోకంటా వచ్చేది కాదు. కాలవ అడ్డు. కాలవ దాటేందుకు ఓ దోనె వుండేది. ఇప్పుడు దోనె లేదు గాని, ఓ వంతెన కట్టారు. కాలవలో పూర్వం వుండేటంత నీరు లేదిప్పుడు.

ఇంటికి రాగానే మా అమ్మ నన్ను కావలించుకుని, చంటి పిల్లని ముద్దెట్టుకుంటూమే అలా ముద్దెట్టుకుంది.

ఆ రోజంతా నన్ను చూడ్డానికి వాళ్ళు వీళ్ళు రావడంతో హడావుడిగా సరదాగా గడిచిపోయింది.

** ** **

మర్నాడు ఉదయం స్నానంచేసి రెడీ అయ్యేసరికి పదయింది. ఒడలికగా వున్నా మా వూర్లో వున్నానన్న ఆలోచన నాకు హుషారు తెచ్చిపెట్టింది.

మా యింటి కెదురుగా ఎప్పుడో వందేళ్ళకి పూర్వం కట్టిన మేడ వుంది. అదిప్పుడు బాగా పాతబడి పోయింది.

ఆ ఇంట్లో సత్యవతీదేవని ఓ మామ్మగారుండే వారు. నా చిన్నప్పుడు ఎక్కువసేపు వాళ్ళింట్లోనే గడిపేదాన్ని.

ఓసారి మామ్మగారిని చూద్దామనిపించింది. అదే విషయం అమ్మతో చెప్పాను.

"ఇంకెక్కడి మామ్మగారే తల్లీ! నాలుగేళ్ళయిం దనుకుంటాను ఈ వూరు విడిచిపెట్టి హైదరాబాదులో వుంటున్న వాళ్ళబ్బాయి దగ్గరి కెళ్ళింది. వెళ్ళిన ఆరు నెల్లకి కాలం చేసిందని విన్నాను" అని చెప్పింది అమ్మ.

ఈ మాట వినగానే నా కళ్ళు చెమ్మగిల్లాయి. ఈ విషయం నాకెవరూ ఉత్తరం ద్వారా అన్నా తెలియబర్చలేదు.

నాలో హుషారు పోయి స్తబ్ధత చోటు చేసుకుంది. చిన్నప్పటి జ్ఞాపకాలు ఒక్కటొక్కటీ నాలో మెదిలాయి.

** ** **


నేను బి.ఏ. ఫైనలియర్ పరీక్షలు వ్రాశాక హాస్టలు విడిచిపెట్టి మా వూరొచ్చేశాను.

చదువు పూర్తయిందని మా నాన్న నా కోసం పెళ్ళి సంబంధాలు చూడ్డం మొదలెట్టాడు.

కాని అప్పటికే నేను కాలేజీ లెక్చరరుగా పని చేస్తున్న ఓ అబ్బాయిని ప్రేమించాను.

ఈ విషయం మా నాన్నగారికి ఎలా చెప్పాలో అర్థం కాలేదు.అందులోనూ అతని కులం మా కులం ఒకటి కాదు. సత్యవతీదేవికి ఈ విషయం చెప్పి సలహా ఇమ్మని అడిగాను.

"మన కోరిక సరైనదని మనకనిపించినప్పుడు దాన్ని వ్యక్తం చెయ్యడానికి భయపడనవసరం




లేదమ్మా. సమయం వచ్చినప్పుడే జాగ్రత్త పడకపోతే పరిస్థితులు చెయ్యిజారిపోతాయి" ఒక నిట్టూర్పు విడిచి మళ్ళీ చెప్పడం మొదలెట్టిందామె.

"ఇప్పుడు సాంఘిక పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. మా కాలంలో అవి ఎంత నిక్కష్టంగా వుండేవో నీకు తెలీదు. వాటికి ఎదురు తిరగడమంటే చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకోవడమేనన్నమాట. అలాగని మన వ్యక్తిత్వం మంట గలుస్తున్నప్పుడు మన ఆశలు బూడిదవుతున్నప్పుడు ఎదురీదక తప్పదు. అంత ఎందుకు? నా జీవితంలో జరిగిన ముఖ్యమైన సంఘటన ఒకటి చెప్తాను విను. నీకే తెలుస్తుంది" సత్యవతీదేవి ముఖంలో గత స్మృతుల తాలూకు నీడలు ప్రతిబింబిస్తున్నాయి. ఆమె చెప్తకు పోతున్నది.

** ** **

సత్యవతీదేవిగారి నాన్నగారు గొప్ప మోతుబరి. ఆయనే వాళ్ళ ఊరికి పెత్తందారు. వాళ్ళ కులానికి పెద్దకూడ. ఆయన పేరు వేణుగోపాలయ్య, కేవలం నగలు భద్రపరిచేందుకువాళ్ళకి ఓ పెద్ద భోషాణం వుందంటే వారి ఆస్తిపాస్తుల్ని మనం అంచనా వేసుకోవచ్చు.

అప్పట్లో ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లో గుర్రపుస్వారి చెయ్యగలిగింది ఆయనొక్కడేనేమో!

సత్యవతీదేవి చిన్నప్పట్నించీ అల్లారు ముద్దుగా పెరిగింది.పెళ్ళీడు రాగానే ఆమెకు ఓ సంబంధం ఖాయం చేసారు. పెళ్ళి కొడుకు వాళ్ళకు దూరపు బంధువే! ఒకటి రెండుసార్లు అతను వాళ్ళింటికి చుట్టపుచూపుగా రావడం, ఆమెకి అతని మీద ఓ మంచి అభిప్రాయం ఏర్పడడం జరిగింది.

తనకు కాబోయే భర్త తనకునచ్చినవాడే కావడంతో సత్యవతీదేవి మనస్సు సంతోషంతో పరవళ్ళుతొక్కింది.

పెళ్ళి ఓ నెల వుందనగా పెళ్ళి పనులు చాలా పెద్ద ఎత్తున ప్రారంభించారు.

చివరికి పెళ్ళిరోజు దగ్గర పడింది.

పెద్ద పెద్ద పందిర్లు వేశారు.

ఇల్లాంతా ఇంద్రభవనంలా అలంకరించారు.

పెళ్ళి రేపనగా మగ పెళ్ళివారు షుమారు యాభై బళ్ళు కట్టించుకొని అతి ఘనంగా తరలి వచ్చారు.

ఎద్దుల మెడల్లో వేళ్ళాడదీయబడ్డ పటకాల మువ్వల సంగీతం, బండి నడిపేవాళ్ళ రంగు రంగుల కొరడా కుచ్చుల నాట్యాలు, బళ్ళు దిగుతున్న ముత్తయిదువుల నగల మిరిమిట్లు ఆ వూరికి కొత్త అందాల్ని తెచ్చాయి.

మగపెళ్ళి వారికి ఓ పెద్ద బంగళా విడిదిచ్చారు.

పెళ్ళిరోజు ఆ వూరి వాళ్ళందరికీ భోజనం బొట్లు సత్యవతీదేవిగారింట్లోనే!


పండిన బంగిని పల్లి మామిడి లాంటి శరీరచ్ఛాయ, అందమైన రూపురేఖలు గల సత్యవతీదేవి అపరలక్ష్మీదేవిలా ముస్తాబు చేశారు. దానికి తగ్గట్టుగా ఆమె ముఖంలో ప్రతిబింబిస్తున్న పెళ్ళికళ ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేసింది.

సత్యవతీదేవి స్నేహితురాళ్ళు పెళ్ళి కొడుకు అందాల్ని, హుందాతనాన్ని ఆమె చెవిలో వర్ణించి చెప్పి ముసి ముసి నవ్వులు జోడించి ఆట పట్టించారు.

ఇక వచ్చిన చుట్టాల హడావుడి అంతా ఇంతా కాదు. కొంత మంది వరసైన వాళ్ళు పిచికారీలతో వసంతాలు కూడా జల్లుకున్నారు.

సాయంకాలం పానకాలు అవీ అయింతర్వాత పెళ్ళి కొడుకుని ప్రత్యేకంగా అలంకరించబడ్డ ముత్యాల పల్లకీలో అతి వైభవంగా ఊరేగించారు. కొంత మంది ముత్తయిదువులు మేనాల్లో ఆసీనులై ఆ ఊరేగింపులో పాల్గొన్నారు. బాండు మేళాలు, భోగం మేళాలు, కోయడాన్సులు, సాధకాలు, కోలాటాలు, గారడీ ఆటలు ఆ ఊరేగింపుకి నిండుదనాన్ని చేకూర్చాయి. మందు గుండు సామాన్ల ప్రేలుడు శబ్దాలు తగినంత ఆట్టహాసాన్ని తెచ్చి పెట్టాయి.

పై ఊళ్ళ నుంచి వచ్చిన వాళ్ళే కాక దాదాపు ఆ




ఊరు అంతా ఊరేగింపులో పాల్గొన్నారు. సుమారు వందకి పైగా పెట్రోమాక్సులైట్లు కాళ్ళొచ్చిన దీపపు స్తంభాల్లా ఆ ఊరేగింపుతోబాటు కదులుతున్నాయి.

మర్నాడు తెల్లవారు ఝామున ముహూర్తం. ఊరేగింపయ్యాక అందరూ కళ్యాణ మంటపం దగ్గరకు చేరుకున్నారు.

పెళ్ళి తతంగం శాస్త్రోక్తంగా సాగిపోతున్నది. ముహూర్త సమయం దగ్గర పడింది. పురోహితుడు బెల్లం, జీలకర్ర సిద్ధం చేస్తున్నాడు.

సరిగ్గా వేణుగోపాలయ్యకు మగపెళ్ళివారితో బాటు కూర్చొని వున్న ఓ వ్యక్తి కనిపించాడు. అతని పేరు జగన్నాథం. కొన్నాళ్ళ క్రితం అతను వాళ్ళ కులం నుండి ఏదో కారణం వల్ల వెలివేయబడ్డాడు.

జగన్నాథం మగపెళ్ళివారికి ఓ విధంగా కావలసినవాడని వేణుగోపాలయ్యకు తెలుసు. అందుకనే ముందుగానే పెళ్ళికొడుకు తండ్రి రాఘవయ్యకు ఇచ్చితంగా చెప్పేశాడు. జగన్నాథాన్ని మాత్రం తన కూతురు పెళ్ళికి తీసుకురావద్దని.

ఇప్పుడు మగ పెళ్ళివారితోబాటు జగన్నాథాన్ని చూడగానే ఆయన కోపం తారాస్థాయికి చేరుకుంది. జగన్నాథం అక్కడ వున్నందుకుగాదు ఆయనకి కోపం వచ్చింది. తను ముందుగా జగన్నాథం విషయములో కుదుర్చుకున్న ఒప్పం దాన్ని రాఘవయ్య ఉల్లంఘించినందుకు.

"రాఘవయ్యా!" ఒక్కసారిగా అరిచాడు వేణుగోపాలయ్య. రాఘవయ్యకూడా వేణుగోపాలయ్యంత ఆస్తిపరుడు కాకపోయినా బాగా వున్నవాడే.

వేణుగోపాలయ్య కేక విని పెళ్ళి పందిట్లోని అందరూ ఆశ్చర్యపోయారు. రాఘవయ్యకి విషయము అర్ధమయింది.

పెళ్ళి తతంగం ఆగిపోయింది.

రాఘవయ్య లేచి నిలబడ్డాడు.

వేణుగోపాలయ్య రాఘవయ్య దగ్గరకొచ్చి "జగన్నాథాన్ని ఈ పెళ్ళికి ఎందుకు తీసుకొచ్చావ్?" గద్దించి అడిగాడు.

"ఎందుకు తీసుకురాకూడదు?"

"అతను కులం నుంచి వెలివేయబడ్డాడు. పైపెచ్చు అతన్ని ఈ పెళ్ళికి తీసుకురావొద్దని నీకు ముందే చెప్పాను"

"నువ్వొద్దంటే మాత్రం నేను మానేస్తానా? నా యిష్టం వచ్చినవాళ్ళని తీసుకు తెచ్చుకుంటాను. నువ్వెవరవు దాన్ని ప్రశ్నించడానికి?"

"అలాగని ముందుగా నాతో ఎందుకుచెప్పలేదు?"

"అప్పట్లో నేను దాని గురించి అంతగా పట్టించుకోలేదు"

......................

......................

పెద్దగా కేక లేసుకున్నారు వేణుగోపాలయ్యా, రాఘవయ్యాను.

"అయితే ఈ పెళ్ళి జరగదు" అన్నాడు వేణుగోపాలయ్య.

"మేమేనా అంత గతిలేని వాళ్ళం. మాకంత కంటే అక్కర్లేదు మీ వియ్యరికం" అన్నాడు రాఘవయ్య ఉద్వేగంతో.

పందిట్లో కలకలం బయలుదేరింది.

మధ్యవర్తుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. రాఘవయ్య విసురుగా వెళ్ళి పెళ్ళి కొడుకు చెయ్యి పట్టుకుని పెళ్ళి పీటల మీద నుండి బయటకు లాక్కొచ్చాడు.

వేణుగోపాలయ్య, రాఘవయ్యల మధ్య మాటా మాటా పెరిగింది.

"ఇక్కడ మీరింక ఒక్క క్షణం కూడా వుండడానికి వీల్లేదు" అన్నాడు వేణుగోపాలయ్య.

"ఇక్కడ వుండవలసిన ఖర్మ మాకేం పట్టలేదు. పదండిరా! పదండి!" అని తన తరఫున వచ్చిన వాళ్ళందర్నీ బయల్దేరదీశాడు రాఘవయ్య.

వధూవరులిద్దరికి ఇదో పెద్ద ప్రళయంలా అనిపించింది.

మగపెళ్ళివారు పందిరి దాటి వెళ్ళారు. ఈ ఘోరాన్ని ఆపు చేయమని పెళ్ళి కూతురి తల్లి వేణుగోపాలయ్యని కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలింది. కాని ఏమీ లాభం లేకపోయింది.

తన వాళ్ళందరూ ముందుకు సాగిపోతున్నా పెళ్ళికొడుక్కి మాత్రం కాళ్ళాట్టం లేదు. వెనక్కి తిరిగి పెళ్ళి కూతురు వైపుచూశాడు. ఆమె కూడా చూసింది అతన్ని. ఇద్దరి చూపులు కలిశాయి. ఆ చూపుల్లో విరహవేదనే గాని విభేదాలు లేవు.

తండ్రి తొందర పెట్టడంతో తప్పేది లేక ముందుకు నడిచాడు పెళ్ళికొడుకు.

సత్యవతీదేవికి ఏదోపిచ్చి ధైర్యం వచ్చింది.

"ఆగండి!" హృదయంలో ఏర్పడ్డ ఉప్పెన కారణంగా ఆమె గొంతులోంచి ఉప్పొంగిన మాటది.

పెళ్ళికొడుకు వెనక్కి తిరిగాడు. వెళ్తున్న వాళ్ళందరూ ఆగిపోయారు.

"నేనూ వస్తున్నాను మీకూడ" ధైర్యంగా నిబ్బరంగా ముందుకు నడుస్తున్నది.

"సత్యవతీ!" గద్దించాడు వేణుగోపాలయ్య.

అయినా సత్యవతీదేవి ఆగలేదు.

ఊహించని ఈ సంఘటనతో వేణుగోపాలయ్య కోపానికి హద్దు లేకుండా పోయింది.

"తండ్రినైన నా మాటని ఖాతరు చెయ్యకుండా వెళ్ళి పోతున్నావు. నేనసలే పట్టుదల మనిషిని. మర్యాదగా వెనక్కి తిరిగిరా. లేకపోతే నీతో ఇదే నా కడసారి మాట!" వేణుగోపాలయ్య వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

సత్యవతీదేవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఒక్క క్షణం ఆగింది. ఆలోచించింది.

"నీ పట్టుదల కోసం ఒక అర్థం పర్థం లేని కారణాన్ని కొండంతలుగా చేసి నా జీవితంతో ఆడుకుంటున్నావు. నా వ్యక్తిత్వం ఛిన్నాభిన్నమైనా నీ మూర్ఖపు పంతాన్ని నిలబెట్టుకోవాలని చూస్తున్నావు. బహుశా "పెద్ద మోతిబరిని, కుల పెద్దని' అన్న దర్పం నీతో అలా చేయించి వుంటుంది. కాని అది నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తే దానికి నేను తలొంచను" అనుకున్నది తనలో తాను.

వెళ్ళిపోవడానికే నిర్ణయించుకుంది.

సత్యవతీదేవి ఇంక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు. గంభీరంగా ముందుకు నడిచింది.

పెళ్ళికొడుకు సత్యవతీదేవికి ఎదురొచ్చి ఆమెకు తన చేతిని అందించాడు.

రాఘవయ్య దానికి అడ్డుచెప్పలేదు.

పై పెచ్చు విజయగర్వంకూడా ప్రదర్శించాడు. ఎందుకంటే ఈ సంఘటనవల్ల వేణుగోపాలయ్య భంగపడ్డాడు. అంటే తను నెగ్గినట్టేగా!

సత్యవతీదేవి వాళ్ళమ్మ కళ్ళల్లోకి చూసింది. ఆ